ప్రజాశక్తి
మంగళవారం 12 నవంబర్ 2024
5
పార్వతీపురం మన్యం

హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు

ప్రజాశక్తి - పార్వతీపురం

జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థి నిమ్మక జీవన్ కుమార్ మృతిపై ఆ పాఠశాల హెచ్‌ఎం ఎన్.తిరుపతిరావుకు అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేశారు. విద్యార్థి జీవన్ కుమార్ ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయడంలో నిర్లక్ష్యం వహించారని, ఎందుకు చర్యలు తీసుకోకూడదని పేర్కొంటూ ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీ వాత్సవ నోటీసు జారీ చేశారు. 24 గంటల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించగా సోమవారం హెచ్‌ఎం తిరుపతిరావు సంజాయిషీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆయన ఇచ్చిన వివరణ ఆధారంగా పిఒ చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

అబ్బబ్బా ఏమి విజన్... జిల్లాపై ఎంత ప్రేమ... ఎంత తీపి మాటలు... ఎంత బడ్జెట్... ఒక్కసారి 40 రోజుల క్రితం సరిగ్గా సెప్టెంబర్ నెలాఖరిలో మన జిల్లా అభివృద్ధికి విజన్-2047 ప్రణాళిక, నేటి బడ్జెట్ కేటాయింపులు చూసుకుంటే అర్థమౌతుంది. నేడున్న రూ.1.46 లక్షల తలసరి ఆదాయం కేవలం 23 సంవత్సరాల్లో రూ.3.23 లక్షలకు తీసుకెళ్తామని, అందుకు తగ్గట్టు వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలను అభివృద్ధి చేస్తామని కూటమి ప్రభుత్వం నమ్మబలికింది. ప్రణాళిక వరకు బాగానే ఉన్నా అందుకు తగ్గట్టు బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. మొదటి సంవత్సర బడ్జెట్‌లోనే ప్రభుత్వ మాటలకు, చేతలకు పొంతన లేదని బయట పడిపోయింది.



అబ్బబ్బా ఎంత బడ్జెట్టో

- అభివృద్ధికి ఘనమైన లక్ష్యాలు
- కంటితుడుపుగా కేటాయింపు
- రూ.1098 కోట్లు అడిగితే.. ఇచ్చింది రూ.64 కోట్లు
- ఇతర సాగునీటి వనరులకూ అంతే సంగతులు
- జిల్లా వాసులను నిరాశ పర్చిన బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అసెంబ్లీ సమావేశాల్లో తొలిరోజు సోమవారం ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇందులో జిల్లా అభివృద్ధికి కేటాయించిన నిధులు కంటితుడుపుగానే ఉన్నాయి. విజన్ -2047 పేరిట వ్యవసాయంతో పాటు పారిశ్రామిక, సేవా రంగాలను అభివృద్ధి చేసి, అభివృద్ధి చెందిన జిల్లాల సరసన చేరుస్తామంటూ సెప్టెంబర్ 30న జరిగిన సమావేశంలో ప్రభుత్వం అధికారులతో చెప్పించిన సంగతి తెలిసిందే. ఇందులో ఏ రంగం అభివృద్ధి చెందాలన్నా నీటి వనరులు అత్యంత కీలకం. నీరుంటే పంటలు పండుతాయి. నీరు లేకుండా పరిశ్రమల స్థాపన, మనుగడ కూడా అసాధ్యం. చివరికి సేవా రంగంలో రోడ్లు వేయాలన్నా, భవనాలు నిర్మించాలన్నా, హోటళ్లు, తదితర వ్యాపార లావాదేవీలు సాగించాలన్నా నీరే కీలకం. ఇంతటి ప్రాధాన్యతగల నీటి వనరుల అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిందెంత? అంటే ఆవగింజలో 60వ వాటానే. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ప్రధానమైన జలవనరులు తోటపల్లి, రామతీర్థసాగర్, జంఝావతి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి. వీటితోపాటు ఆండ్ర, పెద్దగెడ్డ, తాటిపూడి, వెంగళరాయసాగర్, వట్టిగెడ్డ, పెదంకలాం తదితర జలాశయాలు ఉన్నాయి. కానీ, బడ్జెట్ కేటాయింపులో తోటపల్లి, రామతీర్థసాగర్, సుజల స్రవంతికి తప్ప మిగిలిన వాటి ప్రస్తావన లేదు.

ముఖ్యంగా 64 వేల ఎకరాల పాత ఆయకట్టును స్థిరీకరిస్తూనే, కుడి కాలువ ద్వారా అదనంగా 1,31,221 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన తోటపల్లి సాగునీటి ప్రాజెక్టు ఇప్పటికీ సగం విస్తీర్ణానికే నీరందిస్తోంది. ఏటా అరకొర నిధులు కేటాయించి, వాటిని కూడా ఖర్చు చేయకపోవడమే కారణం. ఈ ఏడాది కాలువల నిర్మాణాలు, ఇతర పనుల కోసం రూ.279.96 కోట్లు, భూసేకరణకు రూ.55.81 కోట్లు, నష్టపరిహారం, పునరావాసం కోసం రూ.119.10 కోట్లు, సిఎడిడబ్ల్యుఎంకు రూ.110.06 కోట్లు, నిర్వహణకు రూ.65 లక్షలు.. చొప్పున మొత్తం రూ.565.58 కోట్లు అవసరం కానున్నట్టు తోటపల్లి ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదనలు పంపిస్తే, తాజా బడ్జెట్‌లో కేవలం రూ.36.85 కోట్లు మాత్రమే కేటాయించింది. ఇందులో పనులకు రూ.25.84 కోట్లు, భూసేకరణకు రూ.6.21 కోట్లు, నష్టపరిహారం, పునరావాసం, సిఎడిడబ్ల్యుఎంలకు రూ.4.80 కోట్లు కేటాయించినట్టు బడ్జెట్ పత్రాల్లో పేర్కొంది.

ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేసేందుకు తలపెట్టిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి కేటాయించిన నిధులు అక్షరాల అరవై మూడు రూ.కోట్లకు మించకపోవడం గమనార్హం. రాష్ట్రంలో జల వనరులకు రూ.16,743 కోట్లు కేటాయించగా, అందులో మన జిల్లా వాటా ఇచ్చింది రూ.64 కోట్లు కావడం ప్రభుత్వ వివక్షతకు అద్దం పడుతోంది. నీటి వనరులకే నిధులు కేటాయించని ప్రభుత్వం జిల్లా ప్రగతిని పరుగులు పెట్టిస్తుందంటే నమ్మేదెట్టా? అంటూ జనం చర్చించుకుంటున్నారు.

తోటపల్లి

బడ్జెట్	ప్రతిపాదన	కేటాయింపులు	విడుదల
2019-20	156 కోట్లు	19.19 కోట్లు	13.65 కోట్లు
2020-21	225.57 కోట్లు	56.99 కోట్లు	37.28 కోట్లు
2021-22	199.70 కోట్లు	17.25 కోట్లు	1.35 కోట్లు
2022-23	126.61 కోట్లు	24.35 కోట్లు	4.32 కోట్లు
2023-24	80.84 కోట్లు	84.20 కోట్లు	6.64 కోట్లు
2024-25	565.58 కోట్లు	36.85 కోట్లు	??

నిరాశాజనక బడ్జెట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెట్టిన బడ్జెట్ నిరాశాజనకంగా వుంది. పెంచిన విద్యుత్ ఛార్జీల పై ప్రజలకు ఉపశమనం కల్పించే చర్యలు లేవు. ఎస్సీ,ఎస్టీ సంక్షేమానికి కేటాయింపులు తగ్గాయి.

కె.మన్మధ రావు,
సిపిఐ జిల్లా కార్యదర్శి

కూటమి రాజకీయ కరపత్రంలా ఉంది

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెట్టిన బడ్జెట్ కూటమి పార్టీల రాజకీయ కరపత్రంలా ఉంది. గత ప్రభుత్వం చేసిన విధ్వంసం గురించి పదేపదే విమర్శల దాడి చేయడం తప్ప ప్రజలకు భరోసా ఇచ్చేలా లేదు. సబ్ ప్లాన్ ప్రకారం ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి తగిన కేటాయింపులు చేయలేదు. మహిళా సంక్షేమానికి కూడా కేటాయింపులు తక్కువే. మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాల గురించి ప్రస్తావన లేదు. పెంచిన విద్యుత్ చార్జీల తగ్గింపు గురించి కూడా హామీ లేదు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికుల జీతాల బకాయిల ఊసే లేదు. జిల్లాలో సాగునీటి వనరుల అభివృద్ధి గురించి ప్రస్తావన లేదు. వెనుకబడిన జిల్లా ప్రగతికి ఈ బడ్జెట్ ఏవిధంగానూ దోహదపడేలా లేదు.

రెడ్డి వేణు
సిపిఎం జిల్లా కార్యదర్శి

ఉత్తరాంధ్రకు మరోసారి అన్యాయం

రాష్ట్ర బడ్జెట్ తీవ్ర నిరాశ పరిచింది. ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పోరాడుతున్నా, విశాఖపట్నం స్టీల్‌ప్లాంటును రక్షిస్తామనే కనీస ప్రస్తావన కూడా బడ్జెట్ ప్రసంగంలో లేదు. ఉత్తరాంధ్ర నీటి అవసరాలను తీర్చే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు ప్రస్తావనే లేదు. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న జంఝావతి, తారకరామ తీర్థ సాగర్ వంటి ప్రాజెక్టులను పట్టించుకోలేదు. గిరిజన ప్రాంతంలో జిఒ 3 పునరుద్ధరణ ప్రస్తావన లేకపోవడం గిరిజన యువత ఉపాధిపై తీవ్రంగా ఉంటుంది. గిరిజన కార్పొరేషన్ బలోపేతం చేయాల్సిన అవసరం ఉండగా, కనీసం ఆ ఆలోచన కూడా ప్రభుత్వానికి లేదు.

- ఎం.శ్రీనివాస, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

పాడైపోయిన వరిపంటను చూపుతున్న బాధిత రైతులు

'సంపద'... అంతా పొల్లే

ఫౌండేషన్ సీడ్ తో మోసపోయిన రైతులు
76 ఎకరాల్లో పంటకు నష్టం

ప్రజాశక్తి - మక్కువ

సంపద రకం వరి విత్తనం అధిక దిగుబడి ఇస్తుందని నమ్మిన రైతులు నట్టేట మునిగారు. ఈ విత్తనం వల్ల అధిక దిగుబడి వస్తుందని నమ్మించిన విత్తన కంపెనీ ఏజెంట్ల బారినపడి రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొన్న మొక్కజొన్నలో నంద గిరిజన రైతులు నష్టపోగా, నేడు వరి విత్తుతో కొయ్యన్నపేట రైతులు తీవ్రంగా నష్టపోయిన ఘటన వెలుగు చూసింది. ఇలా రైతులకు అధిక లాభాలు వస్తాయంటూ విత్తన కంపెనీల ఏజెంట్లు ఏ విధమైన అగ్రిమెంటు లేకుండా రైతులను నిండా ముంచుతున్నారు.

మండలంలోని కొయ్యన్నపేటలో పూడి తిరుపతిరావు, పూడి భాస్కర రావు సంపద వరి విత్తనాన్ని సుమారు 14 ఎకరాల్లో సాగు చేశారు. ములక్కాయ వలసకు చెందిన తాడి నాగరాజు, తాడి రామ్మూర్తి, కె.గౌర్నాయుడు, గణపతి మరి కొంతమంది రైతులు సుమారు 62 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో కొంతమంది కౌలు రైతులకు కూడా ఉన్నారు. మండలంలోని ఎర్రసామంతవలసలో గల ఏజెంట్ సిహెచ్ గంగాధర్ వీరి నమ్మబలికి వరి సాగు చేపట్టారు. అయితే వివిధ దశల్లో వరి పైరును ఆశించిన పురుగుల మందుల నివారణకు వాడుతున్నప్పటికీ ఏ విధమైన నివారణ లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ.35 వేలు నుంచి రూ.40వేలు వరకు పెట్టుబడి పెట్టడం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర కంటే రూ.50 అదనంగా చెల్లించి ధాన్యాన్ని తీసుకుపోతామని విత్తన కంపెనీ ఏజెంట్ మాటలు నమ్మి మోసపోయామని అన్నారు. మొత్తం చావు వెన్నుతో పైరు కనిపించడంతో ఏం చేయాలో పాలు పోవడంలేదని రైతులు లబోదిబోమంటున్నారు. సంబంధిత ఏజెంట్ పత్తా లేకుండా పోయాడని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమను మోసగించిన సంబంధిత కంపెనీల ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సంపద పేరుగా చెప్పిన విత్తనాలు కూడా ఆ రకం కావని రైతులు ఆరోపిస్తున్నారు. విత్తన రకాన్ని కూడా పేరు మార్చి మోసగించారని రైతులు ఆరోపిస్తున్నారు. కావున ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ర్యాంపు ఒకచోట... తవ్వకాలు మరో చోట

ప్రజాశక్తి -భామిని

నదిలో అక్రమంగా తవ్వుతున్న ఇసుక

మండలంలోని కాట్రగాఢ -బి సమీపాన గల నేరడి బ్యారేజి హెడ్ రెగ్యులేటర్ వద్ద ప్రభుత్వం ఇసుక ర్యాంపు ఏర్పాటు చేసింది. ప్రభుత్వం గుర్తించిన ఇసుక ర్యాంపు చేపట్టాల్సిన స్థలంలో కాకుండా, నదికి రహదారి వేసి నదిలో ఇసుక ట్రాక్టర్లతో డంపింగ్ చేసి రాత్రి వేళల్లో తరలించే ప్రక్రియ కొనసాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోని పరిస్థితి ఇది. వివరాల్లోకి వెళ్తే...

మండలంలోని కాట్రగాఢ -బి వద్ద నేరడి బ్యారేజి కుడి కాలువకు వంశధార నది నీరు హెడ్ రెగ్యులేటర్ ద్వారా ప్రవహిస్తుంది. ప్రస్తుతం హెడ్‌రెగ్యులేటర్ ఎగువ భాగం పూర్తిగా ఇసుక మేట వేసిందని, దీంతో వంశధార కుడి కాలువ ద్వారా నీరు ప్రవహించే పరిస్థితి లేదని, కావున హెడ్ రెగ్యులేటర్ ఎగువ భాగంలోని ఇసుకను పూర్తి స్థాయిలో తొలిగించాలని వంశధార ఫేజ్-2 ఇంజనీరింగ్ అధికారులు జిల్లా ఇరిగేషన్ అధికారులకు తెలిపారు. జిల్లా ఇరిగేషన్ అధికారులు హెడ్ రెగ్యులేటర్ పరిస్థితిని పరిశీలించి, ఇక్కడ ఇసుక తొలిగించాలని జిల్లాస్థాయి ఉన్నత అధికారులకు నివేదిక అందించారు. అనంతరం సబ్ కలెక్టర్ హెడ్ రెగ్యులేటర్‌ను పరిశీలించారు. అనంతరం ఇరిగేషన్ అధికారులు ఇసుక వెలికితీత, తరలింపునకు టెండర్ వేశారు. హెడ్ రెగ్యులేటర్ వద్ద ఇసుక వెలికితీత, డంపింగ్, లోడింగ్, ట్రాన్స్ పోర్టింగ్ అంతా పారదర్శకంగా జరిగేలా ఇసుక ర్యాంపునకు, ప్రధాన రహదారికి మధ్య చెక్ పోస్ట్, సిసి కెమెరా, రెవెన్యూ సిబ్బందిని జిల్లా అధికారులు నియమించారు. అయితే సదరు టెండరు దక్కించుకున్న వ్యక్తి హెడ్ రెగ్యులేటర్ వద్ద ఇసుక తవ్వకాలు కాకుండా నేరుగా నదిలో ఇసుక తవ్వకాలు చేసి చేస్తున్నారు. ట్రాక్టర్లతో ఇసుకను డంపింగ్ చేసి రాత్రి వేళల్లో తరలిస్తున్నారు. రాత్రులు నిర్దిష్ట సమయంలో సుమారు 20 లారీల వరకు తరలిస్తున్నారు. అనంతరం సిసి కెమెరాలు నిలుపుదల చేసి, ర్యాంపు నుండి ప్రధాన రహదారి వరకు తరలించి, అక్కడ నుంచి ఒడిసా బిల్లులతో అక్రమంగా రవాణా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ప్రక్రియ గత 20 రోజులుగా సాగుతుంది. ఇంత జరుగుతున్నా క్షేత్ర స్థాయిలో గల రెవెన్యూ సిబ్బందికి, చెక్ పోస్ట్ పోలీస్ సిబ్బంది తెలీదా అని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నదిలో తవ్వకాలు రెవెన్యూ సిబ్బందికి తెలివా అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నదిలో ఇసుక తవ్వకాలు నిర్వహించే సమీపాన ఒడిశాకు చెందిన మెగా లిఫ్ట్ ఇరిగేషన్ ఉందని, ఈ ఇసుక తవ్వకాలతో భవిష్యత్తులో వంశధారకు వరదలు వస్తే ఒడిశాలోని షరాలో గల మెగా లిఫ్ట్ ఇరిగేషన్ దెబ్బ తినే అవకాశం ఉందని షరా పరిసర గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వంశధార ఇంజనీరింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు సదరు టెండర్‌దారుడు మిలాఖతై నదిలో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఇసుక అక్రమ తవ్వకాలపై తక్షణమే చర్యలు తీసుకోవాని గ్రామస్తులు కోరుతున్నారు.

రోగులకు నాణ్యమైన సేవలు అందించాలి

వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ కరుణ

ప్రజాశక్తి - పార్వతీపురం

సమావేశంలో మాట్లాడుతున్న వైద్య, ఆరోగ్యశాఖ కమిషనర్ కరుణ

ఆసుపత్రులకు వచ్చే రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలందించాలని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వి.కరుణ వైద్యులకు సూచించారు. రాష్ట్రాభివృద్ధికి ప్రజల ఆరోగ్య ప్రమాణాలు ప్రధానమైనవని స్పష్టం చేశారు. జిల్లాలో తప్పకుండా వైద్య ప్రమాణాలు పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇక్కడ సికిల్ సెల్, తలసేమియా, అనీమియా, పిల్లల ఆరోగ్యం, సంక్రమించే వ్యాధులు, నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలో రోగులకు అందించాల్సిన వైద్య సేవలపై వైద్యులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో రోగులకు అందిస్తున్న ఆరోగ్యసేవలు మరింత మెరుగుపడాలని అన్నారు. ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగిని పలకరించి, వివరాలు తెలుసుకోవాలన్నారు. ఆసుపత్రిలో చేరినప్పటి నుంచి ఇంటికి వెళ్లే వరకు రోగి పూర్తి వివరాలు నమోదు చేయాలన్నారు. రోగిని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి వెళ్లాలని చెప్పారు. తొలుత ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, మందులు, పరికరాలు, సిబ్బంది సమర్ధత వంటి అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్న ఆమె అవసరమైన మెరుగుదలకు సంబంధించిన సూచనలు చేశారు. కేన్సర్ వ్యాధి నెమ్మదిగా విస్తరిస్తుందని అందుకు సార్వజనీన స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.జిల్లాలో 30 ప్రసవాలు చేసే ఆసుపత్రులు ఉన్నాయని, వాటిని మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. కోవిడ్ తర్వాత వైద్య పరికరాలు, మందులపై ప్రభుత్వం దృష్టి సారించిందని, మీకు కావాలసిన వాటి గురించి తెలియజేస్తే తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో గిరిజన ప్రాంతం ఎక్కువగా ఉందని, కొత్త జిల్లా కావడంతో పూర్తిస్థాయిలో వైద్య సదుపాయాలు లేవన్నారు. అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలతో రోగులకు సేవలందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో రక్తహీనత లోపం ఎక్కువగా ఉందని, దీని నివారణకు మెడికల్ బృందాన్ని ఏర్పాటుచేసి పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు ఉన్నారని, వారికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో ఆసుపత్రులకు పడకలు పెంచాల్సిన అవసరం ఉందని, చాలావరకు మాతా. శిశు మరణాలను నివారించగలిగామని కలెక్టర్ తెలిపారు. పిహెచ్‌సి, సిహెచ్‌సిల ద్వారా జిల్లాలో అందిస్తున్న వైద్య సేవలు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిషనర్ కు వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయపార్వతీ, వైద్య ఆరోగ్య శాఖ నోడల్ అధికారి డాక్టర్ ఎం.వినోద్, ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక, సామాజిక ఆసుపత్రుల మెడికల్ ఆఫీసర్లు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

మౌలానా చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

విద్యతోనే ఉన్నత శిఖరాలకు.. : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

చదువుతోనే అత్యున్నత స్థానానికి చేరుకోగలమని గుర్తించిన మహోన్నత వ్యక్తి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆజాద్ చిత్ర పటానికి పూలదండను వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో చదువు మనిషికి గుర్తింపునిస్తుందని, విద్యతోనే ఉన్నత స్థానాలకు చేరుకోగలమని నమ్మిన వ్యక్తి అబుల్ కలాం ఆజాద్ అని కొనియాడారు. అందుకే విద్యకు అధిక ప్రాధాన్యతను ఇచ్చారని, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రిగా పనిచేశారని తెలిపారు. ఆయన జీవితంలో విద్య కోసం అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని, దేశంలోనే అత్యున్నత విద్యా సంస్థ అయిన ఐఐటి ఖర్గపూర్‌కు శంకుస్థాపన చేసేంది ఆజాద్ అని గుర్తుచేశారు. విశ్వవిద్యాలయ విద్యలో బోధన, పరీక్ష, పరిశోధన ప్రమాణాలను నిర్వహించడానికి, నిర్ణయించడానికి, సమన్వయం చేయడానికి ఏర్పాటైన యుజిసి ఆయన కృషి ఫలితమేనని తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ సాహిత్య అకాడమీలకు బీజం వేసింది ఆజాదేనని స్పష్టం చేశారు. ఆయన స్ఫూర్తితో జిల్లాలో 95 శాతం మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారని చెప్పారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులకు చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. అలాగే బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఆజాద్ చేసిన సేవలకు భారతరత్న బిరుదును పొందారని, ఆయన భావాలకు తగిన విధంగా అందరూ నడుచుకోవాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో డిఇఒ ఎస్.తిరుపతినాయుడు, ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీ సంఘాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పత్తి ధర క్వింటాకు రూ.16 వేలు ప్రకటించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి ధర క్వింటాకు రూ.16 వేలు ప్రకటించాలని, నియోజకవర్గంలో కాటన్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని, దళారీలను అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో సిపిఎం మండల విస్తృత స్థాయి సమావేశం జిల్లా కమిటీ సభ్యులు మండంగి రమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రెడ్డి వేణు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలపై భారలు పడుతున్నాయన్నారు. ప్రజల్లో వైశ్యామ్యాలను పెంచే సనాతన ధర్మం మతోన్మాదం పెంచే చర్యను వ్యతిరేకించాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి, వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధరలకై ప్రజలంతా పోరాడాలని పిలుపునిచ్చారు. పంటలు నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, దళారీలను అరికట్టాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోలక అవినాష్ మాట్లాడుతూ గిరిజన రైతులు పండించే పంటలకు కనీసం గిట్టుబాటు ధర లేదన్నారు. రైతులు పండించే పంటలను నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్థిక అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గౌరీశ్వరరావు, బి.శంకర్రావు, ఆడిత్ సన్యాసిరావు, మోహన్‌రావు, సత్యం, పి.తిరుపతిరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

15న జన జాతీయ గౌరవ దివస్

ప్రజాశక్తి -సీతంపేట

ఈనెల 15న బిర్సా ముండా జయంతి సందర్భంగా జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమాన్ని శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలంలో కొత్తగా నిర్మించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు స్థానిక ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం ఈ కార్యక్రమానికి సంబంధించిన అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ హాజరయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజనులకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే అటవీశాఖ పట్టాలు పంపిణీకి చర్యలు తీసుకోవాలని అన్నారు. జన జాతీయ గౌరవ దివస్ సందర్భంగా ఐటిడిఎ పరిధిలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పెయింటింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశించారు. విద్యార్థుల చేత గిరిజన సాంప్రదాయ నృత్యాలను ప్రదర్శించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమం రోజున ప్రధానమంత్రి వర్చువల్‌గా మాట్లాడే అవకాశం ఉన్నందున అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదే రోజు సీతంపేట ఐటిడిఎ సమావేశ మందిరంలోనూ జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పిఒ తెలిపారు. ఈ కార్యక్రమం ఈనెల 15 నుంచి 26 వరకు వివిధ దశల్లో, వివిధ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ చిన్నబాబు, డిఇ సింహాచలం, పిహెచ్ఒ గణేష్ బాబు, వెలుగు ఎపిడి సన్యాసిరావు, డిడి అన్నదొర తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎ ఎఎంఒగా సునీల్

స్థానిక ఐటిడిఎ పరిపాలన అధికారిగా జి.సునీల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయవాడలోని ట్రైబల్ రీసెర్చ్ ట్రైనింగ్ సెంటర్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఎన్నికల డబ్బులు ఇంకా ఇవ్వరా?

లబోదిబోమంటున్న ఫొటో గ్రాఫర్లు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎన్నికలు ముగిసి ఐదు నెలలు కావస్తోంది. జిల్లాల వారీగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి మంజూరైన నిధులు ఖర్చయినట్లు చూపించారు. ఎన్నికల విధులు నిర్వహించిన అధికారులు, ఉద్యోగులకు వెనువెంటనే చెల్లింపులు చేశారు. కానీ ఎన్నికలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీసిన వారికి అధికారులు మొండి చేయి చూపిస్తున్నారు. నియోజకవర్గ కేంద్రంలో గల తహశీల్దార్‌లే ఎన్నికల ఫొటోలు, వీడియోలు తీసిన ఫొటో గ్రాఫర్, వీడిగ్రాఫర్లకు డబ్బులు చెల్లించాల్సి ఉంది. కానీ ఐదు నెలలైనా ఇంతవరకు వారికి పూర్తి స్థాయిలో చెల్లింపులు చేయలేదు. సోమవారం పాలకొండ నియోజకవర్గంలో ఫొటోలు, వీడియోలు తీసిన వారు ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవకు వినతిని అందజేశారు. తమకు ఇంకా రూ.33లక్షలు రావాల్సి ఉందని పాలకొండ ఫొటోగ్రాఫర్ అన్నాజీరావు విలేకరులకు చెప్పారు. పాలకొండ తహశీల్దార్, సబ్ కలెక్టర్‌ను డబ్బులు గురించి అడిగితే నోరు మెదపడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే అనేక సార్లు జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోయారు. నిబంధనల ప్రకారం ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లకు చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకుండా అధికారులు తాత్సారం చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బతుకుతెరువు కోసం పని చేస్తున్న ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల డబ్బుల్లో అధికారులు చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల ఖర్చులకు ఆడిట్ లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా లెక్కలు చూపించి నిధులు దారిమళ్లించినట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

గుమ్మలక్ష్మీపురంలో ర్యాలీ చేస్తున్న సిపిఎం నాయకులు

విద్యుత్ భారాలు తగ్గించాలని సిపిఎం ర్యాలీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వం వెంటనే ప్రజలపై వేసిన విద్యుత్ భారాలు తగ్గించాలని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిర డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, అధిక ధరలు అరికట్టాలని డిమాండ్ చేస్తూ గుమ్మ లక్ష్మీపురం నుండి ఎల్విన్‌పేట వరకు సిపిఎం నాయకులు ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ భారాల పెంపునకు నిరసనగా ఈనెల 14న తహశీల్దార్ కార్యాలయాల వద్ద చేపట్టబోయే నిరసన ధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆమె పిలుపు ఇచ్చారు. ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు కోలక అవినాష్, నాయకులు మండంగి రమణ, కె.గౌరీశ్వరరావు, శంకరరావు, ఆడిత్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

గుంపసోమేశ్వరుడ్ని దర్శించుకున్న కలెక్టర్

ప్రజాశక్తి - కొమరాడ

కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా మండలంలోని గుంప సోమేశ్వర ఆలయంలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత గురించి అర్చకులను అడిగి తెలుసుకున్నారు. ఆలయ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని సిపిఎం నాయకులు కలెక్టరును విన్నవించుకున్నారు. ఆలయ అభివృద్ధికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తామని కలెక్టర్ తెలిపారు. ఆలయానికి వచ్చిన కలెక్టర్‌కు ఆలయ అర్చకులు, దేవదాయ శాఖ సిబ్బంది, కోటిపాం సర్పంచ్ సుంకరి సుగుణ కందువా కప్పి సత్కరించారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎఎస్‌పి

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక పోలీస్ స్టేషను సోమవారం పార్వతీపురం ఎఎస్‌పి అంకిత సురాన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పోలీస్ స్టేషన్లో వివిధ కేసులకు సంబంధించి ఫైళ్లను, రికార్డులను పరిశీలించారు. అలాగే సిబ్బంది పనితీరును, సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. మహిళా పోలీసుల ఉద్యోగ పనితీరు, గ్రామాల్లో మహిళల రక్షణ, బాధ్యతలు గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐ ఎస్.గోవిందరావు, ఎస్సై ఎం.రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

సాగు భూములకు పట్టాలు మంజూరు చేయాలని స్థానిక తహశీల్దార్ డి.రవికి మండలంలోని కొటికిపెంట పంచాయతీ కొత్తపేట, ఒడిసిలమడ గిరిజన రైతులు సర్పంచ్ అప్పలనాయుడు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. రెండు గ్రామాల్లో సుమారు 40 గిరిజన కుటుంబాలు సర్వేనెంబర్ 211లో తాత దండ్రుల నుండి సాగు చేస్తున్న భూములకు డి పట్టా, పోడు పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

విహార యాత్రికులకు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని విహార స్థలాలైన, అడ్డాపుశిల, పిట్టలవలస, అగ్రహారం వనభోజనాలు జరుగుతున్న ప్రదేశాల్లో భద్రతపై సోమవారం యాత్రికులకు రూరల్ ఎస్సై ఎస్.సంతోషి కుమారి అవగాహన కల్పించారు. వనభోజనాలకు తరలి వెళ్లేవారు సురక్షితమైన ప్రదేశాలకు వెళ్లాలని, దూకుడుగా వ్యవహరించి చెరువులు, గడ్డల్లోనూ పెద్దల అనుమతి లేకుండా స్నానానికి దిగకూడదని సూచించారు. అలాగే ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణం చేయ కూడదని, అపరిచిత వ్యక్తుల బైకులపై ప్రయాణించకూడదని సూచించారు.

బియ్యం తరలింపుపై దర్యాప్తు ఏమైంది?

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని ఉలిపిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన బియ్యం పక్కదారిపట్టిన విషయంపై చేపట్టిన దర్యాప్తు ఏమైందని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రశ్నించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బియ్యం పట్టివేతపై పలు అనుమానాలు ఉన్నాయి కావున వీటిపై వెంటనే పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రెండు రోజుల్లో అపార్ పూర్తి చేయాలి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

అన్ని ప్రభుత్వ పాఠశాల, కళాశాల్లో అపార్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఆన్‌లైన్‌లో డేటాను పూర్తి చేయాలని ఎఇఒ డి.గౌరునాయుడు ఆదేశించారు. ఈ విషయాన్ని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాలన ప్రిన్సిపాళ్లుగమనించాలని తెలిపారు. సోమవారం ఆయన చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి అక్కడ 283 మంది విద్యార్థులుండగా కేవలం 167 మంది విద్యార్థుల వివరాలు మాత్రమే పొందుపర్చారని, మిగిలిన విద్యార్థుల డేటాను రెండు రోజుల్లో పొందుపర్చాలని ప్రిన్సిపల్ సవరపు రవణను కోరారు. కార్యక్రమంలో సిఆర్‌పి లు పాల్గొన్నారు.

డిఎస్‌సితో సంబంధం లేకుండా టెట్ నిర్వహించాలి

ప్రజాశక్తి - సీతంపేట

డీఎస్సీ సంబంధం లేకుండా డైట్ చదివిన అభ్యర్థులకు టెట్ పరీక్ష నిర్వహించాలని ఆదివాసీ మాతృ బహుభాషా విద్యా వాలంటీర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి సవర డోంబు, జిల్లా అధ్యక్షులు ఆనందరావు, కోశాధికారి ఎల్లంగో, మహిళా విభాగం కార్యదర్శి ఎం.భారతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ పరీక్ష నిర్వహించకపోవడం వల్ల డైట్ అభ్యర్థులు నష్టపోతున్నారన్నారు. డీఎస్సీ రిక్రూట్మెంట్ లేకపోతే ఏళ్ల తరబడి టెట్ నిర్వహించడంలేదని అన్నారు. దీనివల్ల వయసు పైబడిపోతుందని, ఉపాధి అవకాశాలు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కావున అధికారులు స్పందించి టెట్ పరీక్ష నిర్వహించాలని కోరారు

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

కురుపాం : సైబర్ నేరాలు, మహిళా భద్రతలపై విద్యార్థులు, యువత అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎస్సై పి.నారాయణరావు సూచించారు. సోమవారం స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళా భద్రత, ఇతరత్రా నేరాల పట్ల అవగాహన కల్పించారు. డ్రగ్స్, గంజాయి, మద్యం తదితర మాదకద్రవ్యాలకు దూరంగా ఉన్నప్పుడే ఉన్నతస్థాయికి చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

13న ఉద్యోగమేళా

గుమ్మలక్ష్మీపురం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 13న ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీవరం తెలిపారు. ఈ ఉద్యోగ మేళాలో అరబిందో ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కెమిస్ట్రీ విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణత కలిగిన అభ్యర్థులు లేదా ఏదైనా డిగ్రీ, ఇంటర్ పాసైన అభ్యర్థులు ఈ ఉద్యోగ మేళాకు హాజరు కావచ్చు అన్నారు.

పారిశుద్ధ లోపం లేకుండా చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - కురుపాం

పంచాయతీల్లో పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మండలంలో గల పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీలో చేపట్టాల్సిన పారిశుధ్య కార్యక్రమాలు, హౌస్ వాల్డ్ సర్వే జియో ట్యాగింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జి.రమేష్‌బాబు, మండలంలో గల పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్నఎంపిడిఒ ఉమామహేశ్వరి

పిహెచ్‌సిలను పరిశీలించిన రాష్ట్ర బృందాలు

ప్రజాశక్తి - పాలకొండ

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు పరిశీలనలో భాగంగా వైద్యారోగ్యశాఖ రాష్ట్ర అదనపు సంచాలకులు (ఎంసిహెచ్) డాక్టర్ కెవిఎన్ఎస్ అనిల్‌కుమార్ సోమవారం పర్యటించారు. ఈ మేరకు ఎం.సింగుపురం, అన్నవరం పిహెచ్‌లను తనిఖీ చేసి వైద్య సేవలు, ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణతీరుపై ఆరా తీసి వివరాలు రికార్డుల్లో పరిశీలించారు. పిహెచ్‌సిల్లో మౌలిక సదుపాయాలు, ఆసుపత్రి ఆవరణ పరిశుభ్రత తీరు, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ నిర్వహణ పరిశీలించారు. పిహెచ్‌సిల్లో ల్యాబ్, ప్రసవాల గది, వార్డు, ఫార్మసీ ప్రతి విభాగాన్ని నిశితంగా పరిశీలించారు. పార్చురిషన్ రిజిస్టర్ పరిశీలించి పిహెచ్‌సిల్లో సాధారణ ప్రసవాల సంఖ్య మెరుగుపడాలని, ఆరోగ్య కేంద్రాల్లో కాన్పులు జరిగిన తర్వాత జనన ధ్రువీకరణ పత్రాలను త్వరగా అందజేయాలని అన్నారు. మాతా,శిశు ఆరోగ్య కార్యక్రమాల వివరాలు, నివేదికలు హెచ్ఐఎంఎస్ పోర్టల్‌లో సకాలంలో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రసవం పూర్తైన గర్భిణీ ఖాతాలో జెఎస్‌వై త్వరగా జమయ్యేందుకు అవసరమైన కార్యాచరణ త్వరితగతిన చేపట్టాలన్నారు. ల్యాబ్ నిర్వహణ తనిఖీ చేసి, పరికరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. మందులు, వ్యాక్సిన్ కాల పరిమితిని గమనించారు. టీకా వయల్స్‌పై ఉపయోగించన తేదీని వేయాలన్నారు. ఐఎల్ఆర్ నిర్వహణ ఇంకా మెరుగ్గా ఉండాలన్నారు. కుక్కకాటు, పాముకాటు మందుల లభ్యతను పరిశీలించారు. ఆరోగ్య కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో పూర్తిస్థాయిలో నిర్వహించి ప్రగతి నివేదికలు మెరుగునకు కషి చేయాలన్నారు.పిహెచ్సి ల్లో అన్ని వేళలా సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు మరింతగా బలోపేతం చేసే దిశగా వైద్యారోగ్యశాఖ ముందడుగు వేస్తున్నదని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, స్టేట్ మెటర్నల్ హెల్త్ కన్సల్టెంట్ డా జి.ప్రహర్ష, స్టేట్ ఐటి కన్సల్టెంట్ ఆర్.వెంకటేష్, వైద్యాధికారులు డా వి.కమల్ నాథ్, డా ఎస్.నీతీషా, డా ఎస్. రవికుమార్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

జియ్యమ్మవలస : మండలంలోని రావాడ- రాంబద్రపురం, జియ్యమ్మవలస పిహెచ్‌సిలను రాష్ట్ర ఎన్‌సిఎస్‌డి జాయింట్ డైరెక్టర్ నర్సింగరావు, స్టేట్ కన్సల్టెంట్ డాక్టర్ సౌజన్యల బృందం పరిశీలించి అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సునీల్ కుమార్, ప్రభుతేజ, చంద్రవర్మ, ఆర్ఆర్‌కె చైతన్య, రమ్య తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో కమిషనర్ అఫ్ ఫ్యామిటీ వెల్ఫేర్ విజయవాడ వైద్య బృందం, రాష్ట్ర యూనిసెఫ్ డాక్టర్ విక్రమ్ రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రిలో ఉన్న మందుల నిల్వ, బ్లడ్ బ్యాంకు, ఆక్సిజన్ ప్లాంట్, వార్డు రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలను సూపరింటెండెంట్ డాక్టర్ శోభారాణిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు డా సందీప్, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని మొండెంఖల్, నీలకంఠాపురం పిహెచ్‌సిలను రాష్ట్ర వైద్య బందం రమాదేవి, వాసుబాబు సందర్శించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రజ్ఞ, హర్ష, అభినవ్ కూమార్, అమరసింహారెడ్డి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక పిహెచ్‌సిని తనిఖీ చేసిన మెడికల్, హెల్త్ కమిషన్ టీం ఎన్ఆర్‌హెచ్ఎంఎన్ పిఒ డాక్టర్ సుబ్రహ్మణ్యం సందర్శించారు. అనంతరం కొత్తగా నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఐఒ నారాయణరావు, డాక్టర్ గంగాధర్, స్థానిక వైద్యులు ఉషారాణి పావని, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే పెదంకలం పిహెచ్‌సిని సుబ్రహ్మణ్యంతోపాటు ఆయుష్మాన్ భారత్ పిఒ నరేష్ సందర్శించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు సాహితి . ఉషారాణి పావని వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని వీరఘట్టం, బిటివాడ పిహెచ్‌సిలను ఐడిఎస్‌పి జాయింట్ డైరెక్టర్ మల్లేశ్వరి, జిల్లా మలేరియా అధికారి హేమని, రాష్ట్ర మలేరియా కన్సల్టెంట్ శ్రీకాంత్ సందర్శించి రికార్డులను, లేబర్ రూము, మందులను, పరిశీలించారు. బిటివాడ పిహెచ్‌సిని ఎంసిహెచ్ అడిషనల్ డైరెక్టర్ కెవిఎన్ఎస్ అనిల్ కుమార్, రాష్ట్ర మెటర్నల్ హెల్త్ కన్సల్టెంట్ డాక్టర్ జి.ప్రహరహ, రాష్ట్ర ఐటీ కన్సల్టెంట్ రావి వెంకటేష్, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి జగన్ మోహనరావు సందర్శించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, ప్రదీప్‌కుమార్, నితీష, సూపర్వైజర్లు శాంతికుమారి, లలిత కుమారి, సిబ్బంది ఉన్నారు.

పార్వతీపురం రూరల్ : వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు అందుతున్న వైద్య సేవ, పరిశీలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద బొండపల్లి, బందలుప్పి, డోకిసీల పీహెచ్సీలను రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ కె.ప్రసాద్ బృందం పరిశీలన జరిపింది. సిబ్బంది పనితీరు, వైద్య సేవలు, అందుబాటులో ఉన్న పరికరాలు వినియోగం, రికార్డుల నిర్వహణ నిషిద్ధముగా పరిశీలించి సిబ్బందికి వైద్యులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ తిరుమల ప్రసాద్ శ్రీకాంత్, డాక్టర్ కౌశిక్, గణాంక అధికారి బి శ్రీరాములు నాయుడు శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ : అన్నవరం పిహెచ్‌సిలో రికార్డులను పరిశీలిస్తున్న అనిల్‌కుమార్

పాచిపెంట : మండలంలోని పాచిపెంట, గురువు నాయుడుపేట పిహెచ్‌సిలను రాష్ట్ర హెల్త్ కమిషన్ కార్యాలయ జాయింట్ డైరెక్టర్ బృందం ఆకస్మిక తనిఖీ నిర్వహించింది. జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నిర్మల గోరి, కన్సల్టెంట్ కిరణ్ నాయక్ ఆకస్మిక తనిఖీల్లో పాల్గొన్నారు. వీరి వెంట పాచిపెంట, గురువు నాయుడుపేట వైద్యాధికారులు పాల్గొన్నారు.

మక్కువ : మండలంలోని మక్కువ, శంబర పిహెచ్‌సిలను రాష్ట్ర వైద్య బృందం పరిశీలించింది. అనంతరం వైద్యాధికారులు హరికృష్ణ, కిరణ్ కుమార్‌తో వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ నారాయణరావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు

సీతంపేట : మండలంలోని కుషిమి, మర్రిపాడు, దోనుబాయి పిహెచ్‌సిలను వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ దేవసాగర్ సందర్శించారు. ఈ తనిఖీలో బిఎఫ్‌సి సుధీర్, డిఎంఒ మణి, వైద్య అధికారులు సాయి చరణ్, భాను ప్రతాప్, రవీంద్ర, చాందిని, సత్యవేణి, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలోని గళావిల్లి, అరసాడ, బలిజిపేట పిహెచ్‌సిలను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కన్సల్టెంట్ అధికారులు నరేష్, కోటిరెడ్డి పరిశీలించారు. అలాగే వంతరాం, పెదపెంకిలో క్లినిక్ కేంద్రాలను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : మండలంలోని మామిడిపల్లి, తోణాం, బాగు వలస పిహెచ్‌సిలను అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ పరిశీలించారు. ఆరోగ్య కేంద్రాల్లో రికార్డులను, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఆరోగ్యకేంద్రాల నూతన భవనాలు పరిశీలించిన ఆయన మధ్యలో నిలిచిపోయాయని, భవనాలను నిర్మాణం పూర్తికి సంబంధిత అధికారులకు తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శివ కుమార్, సుజాత, ప్రవీణ్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తుపాను పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - సీతానగరం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్‌తో కలిసి సోమవారం ఆయన పర్యటించి రైతులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం రైతులతో మాట్లాడారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు వరి పంట కోతలను వాయిదా వేసుకోవాలని, అలాగే కోసిన వరి పంటలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించడం, లేదా కుప్పలు వేయాలని, రైతుసేవా కేంద్రాలకు సంబంధించిన అగ్రికల్చర్ అసిస్టెంట్లు గ్రామాల్లో రైతులను అప్రమత్తం చేయాలని తెలిపారు. ఇప్పటికే కోసిన వరి పంట సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందని, రైతులకు అవసరమైన గోనె సంచులను సిద్ధం చేశామని న్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే రైతులు ధాన్యం విక్రయించాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది. రైతులు తదితరులు పాల్గొన్నారు.

బిర్సా ముండా జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి

గుమ్మలక్ష్మీపురం : ఈనెల 15న గుమ్మలక్ష్మీపురంలో జరగబోయే భగవాన్ బిర్సా ముండా 150 జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ట్రైబల్ రైట్స్ ఫోరం రొబ్బ లోవరాజు కోరారు. గుమ్మలక్ష్మీపురంలో విలేకరులతో మాట్లాడారు. ఆదివాసి సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ, జీవనం మనుగడకు కోసం ప్రతి ఒక్కరూ ఆదివాసీ ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో గిరిజన విద్యార్థి సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు దోను సురేష్ ,ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఐ.రామకష్ణారావు, ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా సహాయ కార్యదర్శి యు.తిరుపతి ఉన్నారు.

నిర్మాణం కాని వెల్నెస్ సెంటర్లు... ఆరు బయటే వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రతి సచివాలయంలో పరిధిలో హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. ఉద్దేశం మంచిదైనా, అందుకు సరిపడా నిధులు అప్పటి ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో భవనాల నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. చేసిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టుకోలేక ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో గుత్తేదారులున్నారు. ఇదిలా ఉండగా, ఉపాధి హామీ పథకం ఒక్కొక్క భవనం నిర్మాణానికి రూ.17.5 లక్షల అంచనా వ్యయముతో పంచాయితీరాజ్ శాఖ పర్యవేక్షణలో ఈ పనులు చేపడుతున్నారు. వైయస్సార్ హెల్త్ క్లినికుల నిర్మాణ పనులు పూర్తయితే మిగిలిన రూ.3.3 అదనంగా చెల్లింపులు జరుపుతున్న అధికారులు చెబుతున్నారు. అయితే పెండింగ్ బిల్లులే

వీరఘట్టంలో చెట్ల కింద వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

కిమ్మిలో పునాదులకే పరిమితమైన వైయస్సార్ హెల్త్ క్లినిక్

చెల్లించకపోతే మిగిలిన పనులు ఎలా చేపడతామని కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు.

మండలంలోని 24 సచివాలయాలు ఉన్నాయి. వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 14 సచివాలయాల్లో నడుకూరు, కంబర, నర్సిపురం మినహా ఎక్కడా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు పూర్తికాలేదు. బిటివాడ ప్రాథమిక ఆరోగ్య పరిధిలో 10 సచివాలయల్లో నీలానగరం, వండువ, హుస్సేన్ పురం, కత్తులకవిటి గ్రామాల్లో మినహా మిగిలిన చోట్ల కూడా పనులు పూర్తి కాలేదు. దీంతో గ్రామాల్లో ప్రతిరోజు 104 ద్వారా నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలు సరైన వసతి సదుపాయం లేకపోవడంతో వైద్య సిబ్బంది ఆరుబయట, చెట్లు కింద, పరాయి పంచన వైద్య శిబిరాలు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో ఇటు వైద్య సిబ్బంది, అటు రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్ధాంతరంగా నిలిచిపోయిన వైయస్సార్ హెల్త్ క్లినిక్ పనులు పూర్తిచేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఐటిడిఎ గ్రీవెన్స్‌కు 46 వినతులు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఐటిడిఎ సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 46 వినతులు వచ్చాయి. కార్యక్రమాన్ని సోమవారం యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వీటిలో కొన్ని...

సీతంపేట మండలం ఇప్పమానుగూడకు చెందిన సవర రమేష్ మేకల రుణం మంజూరు చేయాలని, పుబ్బాడ గ్రామానికి చెందిన కూరంగి కొరయ్య తమ గ్రామానికి కరెంటు స్తంభాలు మంజూరు చేయాలని, పెద్దూరు గ్రామానికి చెందిన గేదెల గిరిబాబు 2019 నుండి 2022 వరకు సీతంపేట వైటిసిలో నిర్వహించిన క్యాంటీన్ యొక్క ఫుడ్ బిల్లులు మంజూరు చేయాలని, సీతంపేటకు చెందిన వి.సరస్వతి కుట్టుమిషన్ మంజూరు చేయాలని, రామానగరానికి చెందిన ఎ.శంకర్రావు ఎముక మార్పిడి శస్త్ర చికిత్సకు ఆర్థిక సహాయం చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని పాలకొండకు చెందిన దావాల రమణారావు ఫిర్యాదు చేశారు. అలాగే వీరఘట్టం గ్రామానికి చెందిన మరడాన శాంతి కుమారి భాషా వాలంటీర్ ఉద్యోగం ఇప్పించాలని, అక్కన్నగూడ గ్రామానికి చెందిన సవర చిరంజీవి జీవో నెంబర్ 3కు బదులుగా కొత్తగా 5వ షెడ్యూల్లో గల ఆదివాసీలకు ఉద్యోగాలు, రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ చినబాబు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ రమాదేవి, పిహెచ్ఒ గణేష్ బాబు, ఉపాధి హామీ ఎపిడి శ్రీహరిరావు, వెలుగు ఎపిడి సన్యాసిరావు, డిఇ సింహాచలం, డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ నారాయుడు, ఎఎంఒ కోటిబాబు, జిసిడిఒ రాములమ్మ, సిఎంఒ చిరంజీవులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి సోమవారం ప్రకృతి వ్యవసాయ స్టాల్

ప్రజాశక్తి - పాచిపెంట

కూరగాయలు, ఆకుకూరలు, చిరుధాన్యాలు, దేశీ వరి బియ్యం రకాలతో కూడిన ఎలాంటి రసాయనాలు లేకుండా పండించిన స్వచ్ఛమైన ప్రకృతి సేద్య స్టాల్ ప్రతి సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద ఏర్పాటు చేయనున్నట్టు మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిలో తెలిపారు. దేశీ వరి బియ్యం అత్యంత పోషక విలువలతో కూడుకుందని, వీటిలో నల్ల, ఎర్ర బియ్యం అంటే అనేక ఇతర రకాలు ఉన్నాయని అన్నారు. వీటిని మధుమేహం, మోకాళ్ల నొప్పులు వంటి వ్యాధులున్నవారు తీసుకున్నట్లయితే చాలా ఉపయోగంగా ఉంటుందన్నారు. అలాగే ప్రాసెస్ చేసిన చిరుధాన్యాలు కూడా స్టాళ్లలో విక్రయించబడతాయన్నారు. ఆరోగ్యవంతమైన జీవనానికి ఇది ఎంతగానో తోడ్పడుతుందన్నారు. అలాగే మొదటగా తక్కువ మొత్తంతో ప్రారంభించి ప్రకృతి సేద్య రైతుల సంఖ్యను పెంచి దీన్ని మరింత విస్తృతపరచాల్సిన అవకాశం అవసరం ఉందని తెలిపారు. కావున అందరూ ఈ స్టాల్‌ను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రకృతి సేద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ప్రకృతి వ్యవసాయ పంటలను అమ్మకాలు చేపట్టారు. ప్రకృతి సాగు చేసే వంకాయ, బెండ, దొండ, చిక్కుడు, బీరకాయ ఆకుకూరలు, చిరు ధాన్యాలను అమ్మకానికి ఉంచారు. ఎరువులేని ప్రకృతి వ్యవసాయ పంటలను తినడం ద్వారా ఆరోగ్యవంతలుగా ఉండేందుకు వీలుంటుందని ఎంపిడిఒ సాల్మన్ రాజ్ అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కె.భూషణ, నిర్మల, దీప, చామంతి తదితరులు ఉన్నారు.

ఐటిఐలో అప్రెంటీస్ మేళా

ప్రజాశక్తి -సాలూరురూరల్

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో వివిధ కంపెనీల వారు అప్రెంటీస్ మేళా నిర్వహించారు. ఈ మేళాకు సుమారు 102 మంది విద్యార్థులు హాజరు అయ్యారు. ఇందులో ప్రముఖ కంపెనీల నుంచి అధికారులు పాల్గొని విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎల్అండ్‌టి, కాంచీపురం కంపెనీ వారు ఆన్లైన్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించి సుమారు 48 మంది విద్యార్థులను ఎంపిక చేసుకున్నారు. ఈ కంపెనీల్లో నెలకు ఒక్కొక్క విద్యార్థికి రూ.8500 నుంచి రూ.19500 స్టైఫండ్ చెల్లిస్తారు. ప్రభుత్వం నుంచి కూడా నెలకు రూ.1500 నేరుగా విద్యార్థి ఖాతాలోకి జమ అవుతాయని కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ కోట్ల శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీల ప్రతినిధులు, కళాశాల సిబ్బంది, విద్యార్దులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి

గుమ్మలక్ష్మీపురం : గర్భిణీలకు సరైన పౌష్టికాహారం అందకపోవడం పట్ల మాజీ డిప్యూటీ సిఎం పి.పుష్ప శ్రీవాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. గుమ్మలక్ష్మీపురం గిరిజనుల గర్భిణీల వసతి గృహాన్ని ఆమె సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలకు పౌష్టికాహారం అందుతుందా లేదా అని ఆరా తీశారు. పాలు, గుడ్లు, పళ్ళు పెట్టడం లేదనిగర్భిణులు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులకు సక్రమంగా ఆహారం అందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. నిర్వాహకులపై అధికారులు చర్యలు చేపట్టి గర్భిణులకు సరైన పౌష్టికాహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి దీనమయ్య, ఎల్విన్‌పేట సర్పంచి ఆర్ చైతన్య స్రవంతి ఉన్నారు.

విద్యార్థుల మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

కొమరాడ : ఇటీవల కాలంలో అనారోగ్యం బారినపడి గిరిజన విద్యార్థులు మృతి చెందుతున్నారని, వీరి మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది సుమారు 9 మంది విద్యార్థులు మృతి చెందడం ఎంతో బాధాకరమైన విషయమన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థులు ఇలా అర్ధాంతంగా మృతి చెందడానికి గల కారణాలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో దారుణమన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశ్రమ పాఠశాల్లో ఎఎన్ఎంలను నియమిస్తామని ఇచ్చిన హామీని మరిచారన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గిరిజన విద్యార్థుల మరణాలను నివారించాలని డిమాండ్ చేశారు.

మా గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించండి

పార్వతీపురం టౌన్: తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని సాలూరు మండలం కొదమ పంచాయతి సిరివర గ్రామ గిరిజనులు కోరారు. ఈ మేరకు గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్‌తో కలిసి సోమవారం ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీ వాస్తవ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు లేకపోవడం వల్ల మౌలిక సదుపాయాలకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి పిఒ స్పందిస్తూ రోడ్డు వేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రానో, గ్రామస్తులు పాల్గొన్నారు.

కబడ్డీలో మామిడిపల్లి విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి -సాలూరురూరల్

గుంటూరు జిల్లా బాపట్లలో జరుగుతున్న అండర్-14 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో మండలంలోని మామిడిపల్లికి చెందిన జరజపు బాలాజీ మంచి ప్రతిభ కనబర్చాడు. ఈ మేరకు విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరావు, ఫిజికల్ డైరెక్టర్ ఆనంద్, మండల వైసిపి అధ్యక్షులు సువ్వడ భరత శ్రీనివాసరావు, పాఠశాల కమిటీ అధ్యక్షులు బుగత రవణమ్మ, సర్పంచ్ శశికళ, డొంక అన్నపూర్ణ, బూస తవుడు, రామకృష్ణ మాధవరావు, తిరుపతి రావు, శ్రీను, బుజ్జి రామారావు, బూస తిరుపతిరావు హర్షం వ్యక్తం చేశారు.

చట్టాలు, హక్కులపై నేడు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో ఎస్సీ, ఎస్టీలకు మంగళవారం ఆంధ్రప్రదేశ్ నేర పరిశోధన విభాగం (సిఐడి) ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ ట్రైబుల్ కమ్యూనిటీల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్మెంట్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సాధికారత షెడ్యూల్డ్ ట్రైబుల్ విద్య, హక్కులపై ఒక్క రోజు వర్కుషాప్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక డిసిసి బ్యాంకు సమీపంలో ఉన్న కల్యాణ మండపం వద్ద శిక్షణ ఉంటుందని తెలిపారు.

గంజాయి సాగుపై డ్రోన్లతో నిఘా

ప్రజాశక్తి - కురుపాం

గంజాయి సాగు, రవాణాను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని నీలకంఠాపురం ఎస్సై నీలకంఠరావు అన్నారు. సోమవారం నీలకంఠాపురం పోలీసు స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో డ్రోన్ల సర్వే చేయించారు. మారుమూల గ్రామాల్లో గంజాయి సాగు ప్రాంతాలను గుర్తించేందుకు ఈ డ్రోన్ సర్వే ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అరసాడలో పంట కోతప్రయోగం

ప్రజాశక్తి - బలిజిపేట

ఖరీఫ్ 2024-25 పంట కోత ప్రయోగంలో భాగంగా అరసాడలో పంటకోత ప్రయోగం సోమవారం ఎఒ శ్రావణ్ కుమార్ సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాండమ్ నెంబర్ పద్ధతుల్లో 354-17 సర్వే నెంబర్‌లో ఈ పంట కోత ప్రయోగం రైతు బర్ల అప్పలనాయుడు పొలంలో నిర్వహించారు. దీనిలో భాగంగా 5x5 చదరపు మీటర్ల దూరంలో ప్రయోగం నిర్వహించగా సుమారు 15.360 కేజీల దిగుబడి వచ్చిన ప్రకారం ఎకరానికి సుమారు 2448.32 కేజీల దిగుబడి అంచనా వేశామని తెలిపారు. కార్యక్రమంలో వివిఎలు ఎస్ ఐశ్వర్య , ఎస్విన్ రాజు తదితర రైతులు పాల్గొన్నారు.

వాహనాల దొంగ అరెస్టు

5 ద్విచక్ర వాహనాలు, సెల్ ఫోన్ సీజ్

ప్రజాశక్తి - పాలకొండ

ద్విచక్ర వాహనాలు దొంగలించిన దొంగను పోలీసులు పట్టుకున్నారు. ఆ వ్యక్తి నుంచి ఐదు ద్విచక్ర వాహనాలతో పాటు, ఒక సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను సోమవారం స్థానిక పోలీసు స్టేషనులో డిఎస్‌పి ఎం.రాంబాబు వెల్లడించారు. ఈనెల 4న ఒక ద్విచక్ర వాహనం పోయిందని ఫిర్యాదు రావడంతో పోలీసులు ఎక్కడికక్కడ వాహనాలు తనిఖీ చేపట్టారు. ఆదివారం సీతంపేట నుంచి పాలకొండ వస్తున్న ఈతమానుగూడకు చెందిన సవర సింహాచలంను పోలీసులు ప్రశ్నించగా అది దొంగలించిన వాహనంగా గుర్తించారు. దీంతో అతనను విచారించగా సాలూరు, ఒరిస్సా, పాలకొండ ప్రాంతాల్లో అనేక దొంగతనాలు చేసినట్లు గుర్తించారు. పాచిపెంట, పాలకొండ, సాలూరు రూరల్, ఒరిస్సాలో కాచినగర్‌లో దొంగలించిన వాహనాలతో పాటు సెల్ ఫోన్లను గుర్తించారు.

పరిచయం పెంచుకుంటూ...

సవర సింహాచలం ముఖానికి మాస్కులు పెట్టుకుని బైక్‌లు ఉన్న వారితో పరిచయం పెట్టుకుంటాడు. ఆ తర్వాత చిన్న అవసరం ఉందని బైక్ అడిగి దొంగలిస్తాడు. అదే విధంగా మొబైల్ ఫోన్ కూడా అర్జెంటుగా ఫోన్లో మాట్లాడాలని చెప్పి, ఫోన్ తీసుకుని మాట్లాడుతూ జారుకుంటాడు. పాలకొండలో కూడా అదే విధంగా దొంగతనం చేశాడు. ఏరియా ఆసుపత్రి దగ్గర కూడా అలాగే బైక్ ఉన్న వ్యక్తితో మాట్లాడి, స్నేహం కలుపుకుని, కాంప్లెక్స్ దగ్గర తనను దించాలని చెప్పి కాంప్లెక్స్ దగ్గర నుంచి మూత్ర విసర్జనకి వెళ్తానని వాహనం పట్టుకొని వెళ్లి తిరిగి రాలేదు.

అపరిచిత వ్యక్తులను నమ్మొద్దు : డిఎస్‌పి

అపరిచిత వ్యక్తులను ఎవరూ నమ్మొద్దని డిఎస్‌పి ఎం.రాంబాబు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు మోటార్ సైకిల్, మొబైల్ ఫోన్లు ఇవ్వొద్దన్నారు. అలాంటి సంఘటనలు ఎదురైతే పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలని అన్నారు. ఆయన వెంట సిఐ చంద్రమౌళి, ఎస్సై ప్రయోగమూర్తి ఉన్నారు.